# ఆశాకిరణం

★



రచన: శ్రీ తుమ్మల దాదారెడ్డి.

తరంగాన్ని తరంగం తరుముతుంటే ఒడ్డు చేరిన తరంగం కను మరుగౌతుంది. విశాలమైన కడలితీరాన అంతరంగంలోని అలజడిని అంతం చేసుకోవాలనుకున్న మహేష్‌కు నిరాశే నివాళులిచ్చింది. అర్ధరాత్రి ఏకాంతం. చిన్ననాటి మూత్రం పోసేందుకు గడపదాటాలంటే గడగడలాడే మహేష్ కడలికి చేరువగా గంభీరంగా కూర్చున్నాడు. ఆకాశాన నక్షత్రాలు రత్నాలు నేర్చినట్లున్నాయి. పాపం కొన్ని రాలిపోయే వాటికోసం ఆకాశం కన్నీరు కార్చడం లేదు ఉన్న నక్షత్రాలతోనే తన అందాన్ని ప్రతిబింబిస్తుంది.

ఏదో ఘోరం జరిగేట్టుంది సాక్ష్యం నేనెందుకు అన్నట్లు మబ్బులమాటు కెళ్ళాడు చంద్రుడు. వెన్నెల వెన్నలా కరిగిపోయింది. చీకటి చిరునవ్వులతో చిన్న చిన్నగా చేరుతుంది. మహేష్ మెల్లగా లేచి నడవసాగాడు కడలిలో కలిసిపోవాలని.

ఆగు నీవు ఏం చేస్తున్నావో యోచించే చేస్తున్నావా! నీకోసమే ఇన్నాళ్ళూ బ్రతికి నిన్నింత వాన్ని చేసిన రోగిష్ఠి నాన్నకు నీవిచ్చే తృప్తి ఇదేనా? నిన్నే సర్వస్వమని నమ్మిన ఇల్లాలికి నీ నీడ ఇంతేనా! నాన్నా అని అరిచే నీ పిల్లలకు చూపించే వాత్సల్యం వారిని ఈ లోకంలోకి తెచ్చి నీవు కనుమరుగై కాలంలో కలసిపోయి లోకానికి వదిలేయడమేనా? ఆలోచించు.

ఆలోచించీ ఆలోలించీ మతి చెడగొట్టుకోవడమే కాని నాగతి కుదురుతుందా? షైళ్ళ మధ్య ఆహర్నిశలూ అవస్థపడి ఇంటికి చేరితే తగనిరోగంతో తల్లడిల్లే నాన్న "నాయనా డాక్టరుగారి వద్దకు వెళ్లాను వారు ఈ మందులు రాసిచ్చారు" అంటూ; ఏమండీ ఈ పూటకు బియ్యం లేవు ఇరుగుపొరుగు వారందరివద్దా ఇది వరకే అరువు తెచ్చాను అంటూ ఎదురయ్యే శ్రీమతి; నాన్నా రేపు ఫీజు చెల్లించకపోతే నా పేరు తీసేస్తారట, మాష్టారు మరీమరీ చెప్పారు అంటూ పెద్దోడు; నాన్నా నాకు కొత్త బట్టలు కుట్టించవూ అనే అమ్మాయి; లీవర్ వ్యాధితో మూలిగే చిన్నోడు బిస్కట్లకోసం చేయిచాస్తూ

ఎదురౌతాడు. వీరంతా నాకు మనశ్శాంతిని కరువు చేస్తున్నారేకాని వారు నాకిచ్చేదేముంది. నేను బ్రతకాల్సింది అందరికీ సేవలు అందజేయడానికేనా ?

ఆవేశం అనర్థాలకు దారితీస్తుందేకాని అవకాశాన్ని సద్వినియోగం కానీయదు ఆలోచనలు ఒకేదారిన సాగడం పతనానికే కాని, పురోగతికి కాదు. నిదానంగా యోచించు పెళ్ళాం కన్నుమూసినా. ఇన్నాళ్ళూ నిన్ను చూసుకొని పడరాని పాట్లుపడి నిన్నింత చేసిన నాన్న కనీసపు కోర్కెలను తీర్చడం నీకర్తవ్యం కాదా! మూడు ముళ్ళు వేయించుకున్నందుకు నీతో పాటు అష్ట కష్టాలనుభవిస్తూ ముగ్గురు పిల్లల్ని కని అస్థిపంజరంలా తయారైన నీ భార్య నీకు బరువయ్యిందా! నీ కన్నపిల్లల్నే సాకడానికే భరించలేనని బాధపడుతున్నావా? పిచ్చివాడా!

మహేష్ మెదడు చెదలుతిన్న పిడకలా మారింది. అవును అన్నీ నిజమేకాని నా లోలోన రేగుతున్న తుఫానుకు బాధపడేది ఎవరు? నేనెందుకిలా కుమిలి కుమిలి చావాలి. ఇందతా నా ఖర్మనా, నా సందిగ్ధావస్థల్ని అర్థం చేసుకునే వారెవరు? రేపు జీతం రాగానే నాగతి ఏంకావాలి, వచ్చేవి మూడు వందలు, ఇచ్చేవి ఆరొందలు. అందరికీ ఎలా నచ్చచెప్పాలి. వారంతా ఇనుపమూతి కాకుల్లా పొడుస్తుంటే చచ్చేదానికన్నా ఇలా చావడం నయం కాదా!

బ్రతుకు బ్రతికేందుకే కాని చావడానికి కాదు. ఏది సాధించినా బ్రతికే కాని చచ్చి కాదు. ఆత్మహత్య బలహీనుల పని, చేవలేని వాడు కూడా చావడు, నీకూ కాస్త తెలివి తేటలున్నాయి వాటిని సద్వినియోగ పర్చు. వెనుదిరిగి నిన్ను కాలరాస్తున్న కాలభైరవుల్ని జయించు. ఊసరవెల్లిలోకం నీ చుట్టూ కల్పిస్తున్న ముళ్ళ కంచెలను కాల్చివేయి. నిజాయితీకి జయం ఎప్పటికీ తప్పదు. రెండు చేతులా సంపాదించే నీ కొలీగ్స్‌ను చూసి కసి పెంచుకోగాని వారిలా మాత్రం మారకు. ప్రజాతత్వం మారింది ప్రభుత్వం మారింది గుమాస్తాల జీవితాలకు కూడా ఒక రాస్తా ఏర్పడే రోజు ఆసన్నమైంది. నేటిని తలుచుకొని దుఃఖించేకన్న, రేపు కోసం పాటుపడడం ఉత్తమోత్తమ లక్షణం.

(6)

అవును బ్రతుకుతాను. నాజనం చైతన్యవంతులై భూతలస్వర్గం నిర్మించే రోజు కోసం నిరీక్షిస్తూ అందుకు నా శాయశక్తులా కృషిచేస్తూ ఇలాగే నలుగుతూ బ్రతుకుతాను. రానున్న వెలుగుకోసం ఈ చీకటినంతా మింగేస్తాను అనుకొన్న మహేష్ సాగరానికి దూరమై సంసారానికి చేరువయ్యాడు.

